aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
గురువారం
26-03-2026 సంపుటి : 01 సంచిక : 4 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

## పాక్‌లాగా భారత్ దళారీ దేశం కాదు

- అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదు
- భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉంది
- అఖిలపక్షంలో విదేవాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ - మార్చి 25 (మహాప్రభ)
పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష


-మిగతా 3 లో

కవిత పార్టీకి
## ముహూర్తం ఖరారు

27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన



హైదరాబాద్, - మార్చి 25 (మహాప్రభ)
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు-మిగతా 3 లో



## ఇరాన్ వార్ ఎఫెక్ట్..

- త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్..
- 10-12 శాతం పెంపు..?

న్యూఢిల్లీ - మార్చి 25 (మహాప్రభ)
ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. త్వరలో ఎరువుల కొరత వేధించే అవకాశం ఉంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. ఇండియాలో త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరల్ని పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ యుద్ధం కారణంగా రవాణా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. బీర్ల తయారీలో వాడే గ్లాస్ బాటిల్స్, అల్యూమినియం క్యాన్ల తయారీకి అవసరమైన ముడిసరుకు విదేశాల నుంచే వస్తుంది. ప్రస్తుతం యుద్ధం కారణంగా రవాణా నిలిచిపోయి, వీటి దిగుమతులు ఆగిపోయాయి. దీంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చమురు ధరలు పెరగడం కూడా బీర్ల తయారీపై ప్రభావం చూపుతోంది.

-మిగతా 3 లో




## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, - మార్చి 25 (మహాప్రభ)
గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.

-మిగతా 3 లో

కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి
# గుడ్‌బై


గౌరవం లేని చోట ఎందుకు ఉండాలి?



- ఎంతమందిని తొక్కుతవ్..
- ఎదిరించి పోరాడుతా
- భజన చేసే వారికే పదవులా..? నాకు అర్హత లేదా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఫైర్
- ఇందిరాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజాక్షేత్రంలోకి..
- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి- మార్చి 25 (మహాప్రభ)
కాంగ్రెస్‌లో 40 ఏండ్ల నిస్వార్థ రాజకీయ ప్రస్థానం.. 20 నెలల మానసిక క్షోభ.. సొంత పార్టీలోనే ఎదురైన అవమానాలకు ముగింపు పలుకుతూ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. బుధవారం జగిత్యాలలో భారీగా తన అనుచరులు, అభిమానుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగా

-మిగతా 3 లో



## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం
- ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి
- ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన


వాషింగ్టన్, - మార్చి 25 (మహాప్రభ)
ఇరాన్ తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే..

-మిగతా 3 లో

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్

ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం


3 లో




దేశంలో పెట్రోల్, డీజిల్
# కొరత లేదు

ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు

- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన



న్యూఢిల్లీ, - మార్చి 25 (మహాప్రభ)
పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ ఇచ్చామని,

-మిగతా 3 లో



## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

- గురుగ్రామ్ పోలీసుల తీరుపై మండిపడ్డ సుప్రీం
- చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా
- క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా
- కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు
- చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం
- ఎందుకు వారి ఇంటికి వెళ్లలేక పోయారు
- వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, - మార్చి 25 (మహాప్రభ)
నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్టేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు.

-మిగతా 3 లో




## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

- నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత
- బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు

హైదరాబాద్ - మార్చి 25 (మహాప్రభ)
అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి.

-మిగతా 3 లో

# పార్టీ ఆఫీస్ ఖాళీ చేయండి..

-కాంగ్రెస్‌కు కేంద్రం నోటీసులు




**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
దేశ రాజధాని ఢిల్లీ 24, అక్బర్ రోడ్‌లో ఉన్న కాంగ్రెస్ కార్యాలయాన్ని శనివారం లోగా ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆ పార్టీని ఆదేశించింది. ఈ బంగ్లా 48 ఏండ్లుగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతున్నది. కేంద్రం ఆదేశాలు రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. గత ఏడాది కాంగ్రెస్ పార్టీ కోట్ల మార్గ్‌లోని ఇందిరా భవన్‌లో కొత్త హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించడంతో కార్యాలయం అక్కడికి తరలిపోయింది.అయితే అక్బర్ రోడ్‌లోని కార్యాలయాన్ని ఆ పార్టీ ఖాళీ చేయలేదు. అక్కడ ఇంకా పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బంగ్లాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగించరాదని కేంద్రం గతంలో ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా పార్టీలు సొంత కార్యాలయాలు నిర్మించుకున్నాయి

# సవరించిన ఉడాన్ పథకానికి ఆమోదం


రూ. 28,840 కోట్లు కేటాయింపు



**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
రూ. 28,840 కోట్ల వ్యయంతో 2035-36 వరకు పదేండ్ల కాలానికి సవరించిన ప్రాంతీయ విమాన అనుసంధానత పథకం ఉడాన్‌కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రస్తుతం ఉపయోగంలో లేని రన్‌వేలను అభివృద్ధి చేసి 100 విమానాశ్రయాలుగా మార్చనున్నట్టు చెప్పారు.ఇందుకోసం రూ.12,159 కోట్లను వెచ్చించనున్నట్టు చెప్పారు. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న ఇమిగ్రేషన్, వీసా, ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ పథకాన్ని మరో ఐదేండ్ల పాటు పొడిగిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# అగ్నివీర్‌లకు 20% రిజర్వేషన్లు..

- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం



**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
అగ్నివీరుల పునరావాసం కోసం వారికి 20 శాతం ఉద్యోగాలను కేటాయించాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖలు రాశారు. అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ పదవీ కాలం 2027తో ముగుస్తుందని బుధవారం రాష్ట్రాల సీఎంలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.పోలీస్ కానిస్టేబుళ్లు, ఫారెస్ట్ గార్డులు, ఫైర్‌మెన్‌లు, జైలు వార్డెన్లు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందంలో అగ్నివీర్‌లకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రం కోరింది. అగ్నివీర్‌లకు రిజర్వేషన్లు అమలు చేసిన తొలి రాష్ట్రంగా హర్యానా నిలిచింది. ఈ రాష్ట్రం ఇప్పటికే పోలీస్, మైనింగ్ గార్డులు, జైల్ వార్డెన్లు, స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల నియామకంలో వీరికి రిజర్వేషన్లు ప్రకటించింది.

# యుద్ధ విరమణకు అమెరికా, ఇరాన్ పరస్పర షరతులు

-మొదట 15 కండీషన్స్‌తో సీజ్‌ఫైర్‌కు ట్రంప్ ప్రతిపాదన
-ట్రంప్ షరతులకు అంగీకరించే ప్రసక్తే లేదన్న ఇరాన్
-అంగీకరిస్తే ఆ దేశంపై ఆంక్షలు ఎత్తివేస్తామని ప్రకటన
-ప్రతిగా అమెరికాకు అయిదు షరతులు విధింపు
-వాటికి ఒప్పుకొంటేనే యుద్ధానికి ముగింపని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణకు 15 షరతులతో కూడిన శాంతి ప్రణాళికను ఇరాన్ ముందు ఉంచారు. తమ షరతులకు ఒప్పుకొంటే, ఇరాన్‌పై ఆంక్షలను ఎత్తేస్తామని, విద్యుదుత్పత్తి ప్లాంట్ల నిర్వహణకు ఆర్థిక సాయం చేస్తామని ప్రతిపాదించారు. అయితే అమెరికా ప్రతిపాదనను సమీక్షించిన ఇరాన్ షరతులు తమకు ఆమోదయోగ్యంగా లేవని స్పష్టం చేసింది. అమెరికా ప్రతిపాదనకు తమ ప్రాథమిక స్పందన సానుకూలంగా లేదని, అయినప్పటికీ షరతులపై సమీక్ష కొనసాగుతుందని ఇరాన్ అధికారి ఒకరు రాయిటర్స్ వార్తాసంస్థకు తెలిపారు.యుద్ధం ఎప్పుడు ముగించాలో నిర్ణయం తీసుకునే అధికారం ఇరాన్‌కు మాత్రమే ఉందని ఆ అధికారి స్పష్టం చేశారు. యుద్ధం ముగింపు సమయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించడానికి ఇరాన్ అనుమతించదని ఆయన తెగేసి చెప్పారు. కొన్ని షరతులు పూర్తిగా నెరవేరినపుడు మాత్రమే దాడులను ఆపడానికి అంగీకరిస్తామని ఆయన తెలిపారు. సహజ న్యాయ హక్కు అయిన హొర్ముజ్ జలసంధిపై తమ దేశానికి సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని, యుద్ధ నష్టానికి బాధ్యత ఎవరు తీసుకుంటారో, చెప్పాలని వంటి కొన్ని కీలక డిమాండ్లను ఇరాన్ తెరపైకి తెచ్చింది. భవిష్యత్తులో యుద్ధం పునరావృతం కాకుండా పటిష్టమైన హామీలు ఇవ్వాలని, ఈ యుద్ధానికి మాత్రమే కాకుండా ప్రాంతంలోని తిరుగుబాటు బృందాలతో ముడిపడి ఉన్న ఘర్షణలకు కూడా ముగింపు పలకాలని తాము కోరుకుంటున్నట్లు ఇరాన్ తెలిపింది. తమ షరతులు నెరవేరే వరకు తమ ఆత్మరక్షణ చర్యలు కొనసాగుతాయని ఇరాన్ స్పష్టం చేసింది. తమ షరతులకు ఒప్పుకొంటే, బాలిస్టిక్ క్షిపణుల అభివృద్ధి ప్రక్రియను ఐదేండ్లపాటు నిలిపేయడంతో పాటు యురేనియం నిల్వల పెంపును తగ్గించడం, ఐఏఈఏకు పర్యవేక్షణ అధికారాలు అప్పగించడం, ప్రాంతీయ శక్తులకు నిధులను ఇవ్వడాన్ని నిలిపివేయడం వంటి అమెరికా కండీషన్లకు ఒప్పుకొంటామని ఇరాన్ పేర్కొన్నది.

# డ్రైవింగ్ ఆపితే 26 లక్షల బహుమానం

## మాల్టా ప్రభుత్వం ఆఫర్




**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
: ఐరోపా ఖండంలోని ఓ చిన్న దేశం మాల్టా.. ప్రజలు డ్రైవింగ్ చేయడం ఆపేస్తే డబ్బులు ఇస్తానంటూ ముందుకొచ్చింది. రోడ్లపై ట్రాఫిక్‌ను, కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజలను ప్రభుత్వ రవాణా వైపు ప్రోత్సహించేందుకే ఈ ఆఫర్ ప్రకటించినట్టు చెప్తున్నది. ఈ పథకం కింద పౌరులు తమ డ్రైవింగ్ లైసెన్స్‌ను ప్రభుత్వానికి స్వాధీనం చేసి, ఐదేండ్లపాటు ఎటువంటి వాహనాన్ని డ్రైవింగ్ చేయకూడదు.అప్పుడు ఆ వ్యక్తి సుమారు రూ.26 లక్షల వరకు బహుమతిగా అందుకుంటాడు. అయితే ఈ డబ్బును వాయిదాల పద్ధతిలో చెల్లిస్తారు. ఏటా రూ.5.5 లక్షల చొప్పున ఐదేండ్ల పాటు అందజేస్తారు. ఒకవేళ మధ్యలో గనుక మీరు డ్రైవింగ్ చేస్తే.. అప్పటివరకు అందుకున్న డబ్బును తిరిగి ఇచ్చేయాలి. ఈ పోటీలో పాల్గొనేవారు 30 ఏండ్లు లేదా అంతకన్నా తక్కువ వయసున్న వారై ఉండాలి. వాళ్లు కనీసం ఏడేండ్లు మాల్టాలో నివసించి ఉండాలి. డ్రైవింగ్‌కు సంబంధించి వారిపై ఎటువంటి కేసులు ఉండకూడదు. పోటీలో పాల్గొనే అవకాశం ఏడాదికి వెయ్యి మందికి మాత్రమే లభిస్తుంది.


# ఇరాన్‌పై 15 వేలకుపైగా బాంబులు వేశాం..

- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్




**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
ఇరాన్ తో అమెరికా-ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ప్రారంభమై దాదాపు నెలరోజులు అవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి యుద్ధం సాగుతోంది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌పై 15 వేల బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ (ఖఫ్ఓవ) ప్రకటన చేశారు.ఫిబ్రవరి 28న అమెరికాతో కలిసి ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించింది. ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ చెప్పారు. గత ఏడాది జూన్‌లో 12 రోజులపాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగు రెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు చెప్పారు. ఇరాన్‌పై దాడిని ఐదు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. అయితే ఆ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

# ఉక్రెయిన్‌పై 1000 డ్రోన్లతో దాడి



**మాస్కో,- మార్చి 25 (మహాప్రభ)**
ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులతో విరుచుకుపడింది. 24 గంటల వ్యవధిలో ఉక్రెయిన్‌లోని పలు నగరాలపై దాదాపు 1000 డ్రోన్లను ప్రయోగించింది. డ్రోన్ దాడుల్లో కనీసం 8 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇందుకు తగిన ప్రతీకారం తీర్చుకుంటామని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు.ఉక్రెయిన్‌లోని వివిధ నగరాల్లోని నివాస భవనాలు, విద్యుత్తు, రవాణా కేంద్రాలే లక్ష్యంగా రష్యా దాడులు కొనసాగాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పగటి సమయంలో జరిగిన అతిపెద్ద దాడిగా దీనిని పేర్కొంటున్నారు.

# నిలకడగా సోనియా ఆరోగ్యం



**న్యూఢిల్లీ,- మార్చి 25 (మహాప్రభ)**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియాగాంధీ ఆసుపత్రిపాలయ్యారు. వాతావరణ మార్పుల వల్ల ఆమె కడుపు, మూత్రనాళంలో ఇన్ఫెక్షన్ చేరిందని, చికిత్స కోసం సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేర్పించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చేరిన ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, చికిత్సలో భాగంగా యాంటీబయాటిక్స్ వాడుతున్నట్లు ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

# సొంత ప్రభుత్వంపై షిండే విమర్శలు

-అది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే..
-జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలు



**న్యూఢిల్లీ, - మార్చి 25 (మహాప్రభ)**
మహారాష్ట్ర మాజీ సీఎం, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తన సొంత మహాయుతి కూటమి, అధికార బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. సతార జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ నేతలు పలు అక్రమాలకు పాల్పడ్డారని, పౌరులు ఓటు వేయకుండా పోలీసులు అడ్డుకున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని విమర్శించారు. కాగా, తన సొంత కూటమి ప్రభుత్వంపైనే షిండే విమర్శలు చేయడం అసాధారణమని, రెండు పార్టీల మధ్య విభేదాలకు ఇది చిహ్నమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.కాగా, మార్చి 20న జరిగిన సతార ఎన్నికల్లో ఛైర్మన్ పదవికి శివసేన పోటీ చేసింది. శివసేన-ఎన్సీపీ కలిసి పోటీ చేసి గరిష్ఠ ఓట్లు తెచ్చుకున్నప్పటికీ బీజేపీకి చెందిన ప్రియా షిండే ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు. కాగా, శివసేన సభ్యులు కొందరిని ఉన్నతాధికారుల ఆదేశం మేరకు స్థానిక పోలీసులు ఓటింగ్ వేయకుండా నిర్బంధించారని షిండే ఆరోపించారు.

# ఇరాన్ వార్ ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ప్రపంచంలో నాలుగోవంతు నేచురల్ గ్యాస్‌ను ఇండియా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అది కూడా ఎక్కువగా పశ్చిమాసియా నుంచే వస్తుంది. అందులోనూ ఖతార్ నుంచే 40 శాతం చమురు దిగుమతి అవుతుంటుంది. కానీ, ఇప్పుడు గ్యాస్ సరఫరా లేక చమురు ధరలు పెరగడం, బాటిల్స్ సరఫరా నిలిచిపోవడంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా గ్లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి.లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. ఫలితంగానే రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధరలు పెంచాలని ప్రయత్నిస్తున్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని ప్రభుత్వాల్ని కోరుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వాలు అంగీకరిస్తే త్వరలోనే బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

మొదటి తరువాయి

అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

మొదటి తరువాయి

సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

మొదటి తరువాయి

తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.


## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

మొదటి తరువాయి

ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్ట్‌లు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్

**ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం**



**న్యూఢిల్లీ,**

రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ 'ప్రాజెక్టు కుశ' తొలి అభివృద్ధి పరీక్షలను భారతదేశం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ వ్యవస్థను మూడు అంచెల ఇంటర్‌సెప్టర్ క్షిపణి అమరికతో రూపొందించారు.ఇది 150 కి.మీ నుంచి 450 కి.మీ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే లక్ష్యంగా దీనిని రూపొందించారు.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

మొదటి తరువాయి



తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ విధానాలకు రాష్ట్ర నాయకత్వం తూట్లు పొడుస్తోందని ఆరోపిస్తూ.. సీఎం ఒంటెద్దు పోకడలు, పార్టీ ఫిరాయింపుల ప్రోత్సాహం, నామినేటెడ్ పదవుల పంపకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత మందిని తొక్కుతావ్..నీ దయాదాక్షిణ్యాలకు లొంగేది లేదు.. ఎదిరించి పోరాడుతా' అంటూ సీఎంకు సవాల్ విసిరారు. భావోద్వేగ వాతావరణంలో కార్యకర్తల సమక్షంలో రాజీనామా లేఖను విడుదల చేసిన జీవన్‌రెడ్డి, తన ఆవేదనను పంచుకున్నారు. తన సొంత అనుచరుడి హత్య జరిగితే, ముఖ్యమంత్రి కనీసం పరామర్శించడానికి కూడా రాలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తనతో ఉన్న కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయానని, ఓపికకు కూడా ఓ హద్దు ఉంటుందని, అందుకే బాధాతప్త హృదయంతో పార్టీని వీడుతున్నానని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను వీడినా.. ఇందిరాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజాక్షేత్రంలోనే కొనసాగుతానని ప్రకటించారు.

రాహుల్ సిద్ధాంతాలకు తూట్లు.. ఫిరాయింపులపై ఫైర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోవడాన్ని జీవన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. పార్టీ శ్రేణులకు ఇష్టం లేకపోయినా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను చేర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' అంటూ ముందుకు వెళ్తుంటే, రాష్ట్ర నాయకత్వం ఆ విలువలను నీరు గారుస్తోందని విమర్శించారు. పార్టీ ఎంపీ అభ్యర్థుల ఓటమికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న తప్పుడు నిర్ణయాలే కారణమని విశ్లేషించారు. సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌ను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలనుకుంటే, ముందు ఆయనతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాల్సిందని అన్నారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే.. రాజీనామా చేయకుండా కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేయడం వల్లే సికింద్రాబాద్ సీటు కోల్పోయామని తెలిపారు. చేవెళ్ల నుంచి ముందుగా సునీతా మహేందర్‌రెడ్డికి టికెట్ ఖరారు చేసి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి రంజిత్ రెడ్డిని తీసుకొచ్చి టికెట్ ఇవ్వడం వల్లే ఓటమి పాలయ్యామన్నారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఓటమికి కూడా రేవంత్ తీసుకున్న ఇలాంటి నిర్ణయాలే కారణమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎదగాలంటే రాహుల్ గాంధీ విధానాలు పాటిస్తే సరిపోదని, రేవంత్ రెడ్డి అడుగులకు మడుగులొత్తుతూ ఆయన దయాదాక్షిణ్యాలపై బతికే వారికే గుర్తింపు దక్కుతోందని ఆరోపించారు. 'వేం నరేందర్‌రెడ్డి ఎవడు? ఆయన పార్టీకి చేసిన సేవ ఏంటి?' అని ప్రశ్నించారు. 'నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం) పదవి ఇచ్చారు. ఈ 20 నెలల్లో వ్యవసాయ రంగంపై ఆయన ప్రభుత్వానికి ఇచ్చిన సలహాలేంటో చెప్పాలి. నాకు అర్హత లేకనా పదవులు ఇవ్వలేదు?' అని ప్రశ్నించారు. 'ఈ పార్టీ నాది.. నాకెవడైనా అడ్డమొస్తే తొక్కుతా' అన్నట్టుగా రేవంత్‌రెడ్డి వైఖరి ఉందన్నారు. 'ఎంతమందిని తొక్కుతావ్ నువ్వు? నీ తొక్కుడుకు భయపడేది లేదు. నీతో అణగదొక్కబడే కంటే ఎదిరించి పోరాడితే పోయేదేముంది?' అని అన్నారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

మొదటి తరువాయి

ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ది జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వైరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

మొదటి తరువాయి

నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్ళెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి.

మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉ

# తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

మొదటి తరువాయి

నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది.÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్‌వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఒ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతు న్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలి కంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఒ, ఎక్షఅఒ, ఃఖఅఒ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ూక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

# సంపాదకీయం

## ఆయిల్ సంక్షోభంలో భారత్ !




మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్తితులు రాబోతు న్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి. దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్నమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చన్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించు కోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు. రేపు మరెలాంటి ముప్పు వస్తుందో చెప్పలేం. అందువల్ల భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగుల వేయాలి. ప్రజలను అందుకు సన్నద్ధం చేయాలి.

# శ్రీమాతా సేవ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



**కామారెడ్డి జిల్లా - మార్చి 25 (మహాప్రభ)**
కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు టేక్రియల్‌లో ఇటీవల మరణించిన పెంకుల బాబు కుటుంబానికి శ్రీమాత సేవ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ సభ్యులు సాయిరాం, నారాయణరావు, గంగాధర్, చక్రధర్ రావు, 13వ వార్డు కౌన్సిలర్ చిట్టీబాబు, గోపాల్ రావు, రాజు నరసింహులు, టీచర్ రాజు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రూ.6,300 నగదు సహాయం తో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు.భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు శ్రీమాత సేవ చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాంత్ దత్త, మరియు వారి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ఎస్.సి, ఎస్టీలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

-జిల్లా కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
-రెవిన్యూ - ఫారెస్టు భూముల సమస్యను పరిష్కరించాలి.
-ఎస్.సి, ఎస్టీ కాలనీలకు రోడ్లు, స్మశానం, మౌలిక వసతులు కల్పించాలి.
-జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే డిమాండ్







**మార్చ్ 25 తిరుపతి జిల్లా (సత్యవేడు) మహాప్రభ**
సత్యవేడు నియోజకవర్గం లోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ లకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ను కోరారు. బుధవారం తిరుపతి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ తన సత్యవేడు నియోజకవర్గం లో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రోడ్లు, మురికి కాలువలు, స్మశానాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీలలో గత ఏడాది తీసివేసిన ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ అక్కడే కొనసాగేటట్లు చూడాలని కోరారు. కేవిబి పురం తో పాటు కొన్ని మండలాల్లో రెవిన్యూ శాఖ ఎస్సీ, ఎస్టీ లకు ఇచ్చిన భూములు తమ శాఖ పరిధిలో ఉందని అటవీశాఖ అధికారులు హరిజన, గిరిజనులను అడ్డుకుంటోందని ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో హరిజన, గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఎస్సీ, ఎస్టీ లపై దాడులు జరగకుండా చూడాలని పోలీసు శాఖ ను ఎమ్మెల్యే కోరారు. సత్యవేడు లో అంబేత్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్లు ను ఎమ్మెల్యే కోరారు. ఎస్సీ, ఎస్టీ లు అధిక శాతం ఉన్న కేవిబి పురం లో టిటిడి కల్యాణ మండపం నిర్మించాలని ఎమ్మెల్యే జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

# జజాల సురేందర్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



**తాడ్వాయి, మార్చి 25: (మహాప్రభ)**
ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని తాడ్వాయి మండల నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు శ్రీ శబరీ మాతాజీ ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఆశ్రమంలో దేవతలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మాజీ ఎమ్మెల్యే జజాల సురేందర్ ఆయురారోగ్యాలు కలగాలని, ఆయన్ను మరింత ఉన్నత స్థానాలకు చేర్చాలని ప్రార్థించారు. అనంతరం నాయకులు కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని జజాల సురేందర్ సేవలను కొనియాడారు. ఆయన ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో ప్రాంత అభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# విజిలెన్స్&ఎండార్స్మెంట్ మరియు రెవెన్యూ అధికారుల తడ లో విస్తృత తనిఖీలు



**మార్చ్ 25 తిరుపతి జిల్లా (తడ) మహాప్రభ**
తిరుపతి జిల్లా తడ లో మంగళవారం విజిలెన్స్ & ఎండార్స్మెంట్ మరియు రెవెన్యూ అధికారుల తనిఖీల లో తడ కండ్రిగ శ్రీ కాళహస్తి రోడ్ లో ఉన్న ఎస్‌ఎస్‌ఆర్ వైన్స్, కె ఆర్ జీవా ఫ్రైడ్ రైస్ షాప్ నందు నిబంధనలకు విరుధంగా 5 డొమెస్టిక్ ఎల్పిజి సిలిండర్ లు కమర్షియల్ గా వినియోగిస్తున్న కారణముగా 6(ఏ) కేసు బుక్ చేసి సిలిండర్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీ లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు ఏ ఓ రామాంజనేయులు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పి వెంకటాద్రి, రెవెన్యూ అధికారులు వనజ, ఆర్. ఐ మరియు వి ఆర్ ఓ ఆర్.భారతి పాల్గొన్నారు.

# పెద్ద గుట్ట దర్గా వద్ద ప్రత్యేక పూజలు

-ఉర్సు, న్యాజ్ కార్యక్రమాలకు భక్తులకు ఆహ్వానం



**తూప్రాన్, మార్చి 25 (మహాప్రభ)**
తూప్రాన్ పట్టణంలోని గీతారెడ్డి కాలనీలో వెలసిన పెద్ద గుట్ట దర్గా వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ప్రముఖ మౌల్సాబ్, మత గురువు శ్రీ ఫాజిల్ బాబా నజీరొద్దీన్ ఛిస్తి ఈ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమత సారాంశం ఒక్కటేనని, ప్రపంచ శాంతి మరియు పరోపకమే మనిషి జీవిత లక్ష్యమని తెలిపారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందాలని ఆకాంక్షించారు. రాబోయే ఏప్రిల్ 10వ తేదీన నిర్వహించనున్న ఉర్సు, న్యాజ్ కార్యక్రమాలకు తూప్రాన్ ప్రాంత ప్రజలందరూ భారీగా హాజరై పెద్ద గుట్ట స్వామి ఆశీర్వాదాలు పొందాలని భక్తులను ఆయన కోరారు.

# దేవరకొండ న్యాయవాదుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

## -అధ్యక్షుడు ఉమామహేశ్వర్





**దేవరకొండ మార్చి 25 (మహాప్రభ):** దేవరకొండ న్యాయవాదుల అసోసియేషన్ 2026-2027 సంవత్సర కాలానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ బలోపేతానికి మరియు న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేసేలా వారిని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడు సన్నాయిల ఉమామహేశ్వర్,ప్రధాన కార్యదర్శి వనం జగదీశ్వర్, కోశాధికారి ఈడం రవికుమార్, ఉపాధ్యక్షులు ఎల్.కె. దుర్గ, వి. శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు చిలువేరు పుష్పలత, ఎం. యాదయ్య,కల్చరల్ కార్యదర్శి శంకర్ వీరితో పాటు కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సీనియర్ న్యాయవాదులు శ్రీ గాజుల ఆంజనేయులు, లోహిత్ రెడ్డి, శౌకత్ అలీ, ఇంద్రవరప్రసాద్, మరియు ముస్తాక్ అహ్మద్ గార్లు పాల్గొని నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం అసోసియేషన్ అభివృద్ధి కోసం, యువ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల అధికారి రియాజుద్దీన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసినందుకు మరియు ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ప్రతి న్యాయవాదికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొంతానాపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి...



**శివంపేట, మార్చి 25 (మహాప్రభ):** శివంపేట్ మండల పరిధిలోని కొంతాన్ పల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి కి గ్రామ సర్పంచ్ శ్రీమతి విజయ వెంకట్రామిరెడ్డి , గ్రామ పాలకవర్గం మరియు గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.

గ్రామంలోని ప్రతి కాలనీలో నూతన సి.సి రోడ్లు పూర్తి కావడంతో వాటిని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపడతామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు.

అదనంగా గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా శుభ్రత, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలను నాయకుడికి వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా, మాజీ జడ్పిటిసి లక్ష్మీ కాంతారావు, దంతాన్ పల్లి గ్రామ సర్పంచ్ మమత నర్సింలు, గుండ్లపల్లి గ్రామ సర్పంచ్ మమత నర్సింలు యాదవ్, ఉప సర్పంచ్ బొల్లారం కుమార్ ముదిరాజ్, వివిధ గ్రామాల ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు మరియు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రామాయంపేట మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు ప్రారంభం





**రామంపేట మార్చి 25 (మహాప్రభ):** రామాయంపేటలో కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మెయిన్ రోడ్డు ను ఈరోజు రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు అందరు కలిసి ఊర్లో రోడ్డు వెడల్పులను కొలతలు వేస్తూ దుకాణదారుల సముదాయించారు. మొదటి విడతగా అంబేద్కర్ విగ్రహం నుండి పోస్ట్ ఆఫీస్ వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపడతామని అలాగే. రెండో విడత అంబేద్కర్ టార్చ్ నుండి పొట్టి శ్రీరాములు వరకు రెండో విడతగా. పనులు ప్రారంభిస్తామని మున్సిపల్ కౌన్సిలర్ అందరూ ఈరోజు ఊర్లోని రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని కొలతలు వేస్తూ ఈరోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఈ రోడ్డు విస్తరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని వారు అందర్నీ కోరుతున్నారు దయచేసి ఎవరైనా ఈ యొక్క విస్తరణ కార్యక్రమానికి అడ్డువస్తే ఊరుకునేది లేదని ఎందుకంటే ఇది గత కొన్ని సంవత్సరాల నుండి ఈ యొక్క కార్యక్రమాన్ని చేపడతామని ఎవరు కూడా చేపట్టలేకపోయారని ఈసారి మాకు అవకాశం వచ్చినందుకు మేము అందర్నీ కలుపుకొని పోతూ ఈ యొక్క కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే మొదట. ఈరోజు కౌన్సిలర్లు ఒకటవ వార్డు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ డ్రైనేజీలు సిసి రోడ్లు ఎక్కడ అవసరమున్నవో వారు తెలుసుకుంటూ

ఎక్కడ అవసరం ఉన్న డ్రైనేజీలు కానీ ,సిసి రోడ్లు కానీ అవసరం ఉన్నచోట. వేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు వార్డ్ సభ్యులు కూడా ప్రతి ఒక్కరు నాకు సహకరిస్తారని ఆశిస్తున్నాను ఈ యొక్క పట్టణాన్ని రూపురేఖలు మార్చేందుకు మా యొక్క పాలకవర్గం సిద్ధంగా ఉందని దీనికి తోడు మీ ప్రజల సహకారం కూడా ఉండాలని ఆయన కోరారు కనుక మాకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మరియు ఎమ్మెల్యే రోహిత్ రావు ఎల్లవేళలా మాకు సహకరిస్తారని వారు మాకు హామీ ఇచ్చారు. కనుక ఈ యొక్క కార్యక్రమం రామాయంపేట అభివృద్ధి కోసమే కనుక రామాయంపేట ప్రజలందరూ పార్టీలను పక్కనపెట్టి ప్రజలందరూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని వారు పిలుపునిచ్చారు దీనికి అందరి సహకారం ఉండాలని ముఖ్యంగా గ్రామంలో ఉన్న అన్ని కులాల పెద్దలు మరియు వాటి నాయకుల సహకారాలు ఉంటాయని వారు వ్యక్తం చేశారుఈ యొక్క కార్యక్రమంలో రామాయంపేట కౌన్సిలర్ బెజవాడ నాగరాజు దేవుని రంజిత్ దానికి స్వామి పుట్టి సందీ ప. పట్టణ అధ్యక్షులు చింతల స్వామి మరియు కార్యకర్తలు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఏసీబీ వలలో ఎస్సై వెంకటేశ్వర్లు

**సిద్ధిపేట, మార్చి 25 (మహాప్రభ):** పట్టుకున్న ఇసుక లారీని విడిచిపెట్టేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసి, రూ.15 వేల యూపీఐ పేమెంట్ ద్వారా స్వీకరించిన ఎస్సై వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారుల వలలో చిక్కారు.ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పనిచేసిన సమయంలోనే ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం సిద్ధిపేట 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీవిద్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం.

## -గురుకుల పాఠశాలకు 14మంది విద్యార్థుల ఎంపిక.




**పాపన్నపేట,మార్చి 25 (మహాప్రభ):** తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో శ్రీ విద్య పాఠశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్షలలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రిజల్ట్స్ మంగళవారం సాయంత్రం ప్రకటించడంతో శ్రీ విద్య పాఠశాల నుండి మొదటి విడత జాబితాలో 15మంది పరీక్ష వ్రాయగా 14మంది విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు 5వ తరగతి ప్రవేశ కు అర్హత సాధించారు. కాగా పాఠశాల నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ప్రవేశ పరీక్షలో పాల్గొని పరీక్ష వ్రాయగా 14మంది విద్యార్థులు ర్యాంకు సాధించడం కోసం కృషి చేసిన ఉపాధ్యాయులు దుర్గ. సునీత. అనురాధ. షీలా. విలాస్. జ్యోతిరాజ్ ప్రధాన్ లు పాఠశాల యాజమాన్యం,ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా .,కరస్పాండెంట్ లు నిటలాక్షప్ప. సుమన్, లు అభినందించారు. ప్రతి ఏటా తెలంగాణ గురుకుల పాఠశాలలో శ్రీ విద్య స్కూల్ ప్రవేశ పరీక్షలలో ప్రతిభ కనబరచడంతో ఇలాంటి ఫలితాలు పునరావృతం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు...


# మహానగరంలోనే సేవాలాల్ పుణ్యక్షేత్రం ఉండాలి




**మెదక్ జిల్లా మార్చి 25 (మహాప్రభ):** మెదక్ జిల్లా తూప్రాన్ లో సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం హైదరాబాద్ లో ఏర్పాటు కోసం గురువారం అసంబ్లీ ముట్టడికి వెళ్తున్న బంజారాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ తో పాటు మరికొందరిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాలా? లంబాడీల కోరిన చోట సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం ఏర్పాటు చేయాలని లంబాడీల ఆత్మగౌరవం ఉంటుందని సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం అడవిలోనే ఉండాలన్న హైదరాబాదులో ఉండకూడదని ఆలోచనతో మేము అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుంటే తూప్రాన్ పోలీస్ స్టేషన్ లో అరెస్ట్ చేయడం జరిగింది. అరెస్ట్ కుట్రలతో ఏవి చేసిన హైదరాబాదులోనే పుణ్యక్షేత్రం ఉండేలా చేయాలని లేని ఎడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో చర్చించి రాబోయే కార్యచరణ ప్రకటిస్తామని జైపాల్ నాయక్ తెలిపారు.


# రూ. 3 కోట్ల 80 లక్షల 1000 రూపాయలకు సంత వేలం

## -రికార్డ్ స్థాయిలో నిలిచిన భాస్కర్ రెడ్డి,



**దేవరకొండ మార్చి 25 (మహాప్రభ):** దేవరకొండ నియోజకవర్గం కొండ మల్లేపల్లి పశువుల సంత ఈసారి రికార్డు స్థాయిలో నిలిచింది. బహిరంగ వేలంపాటలో ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో, కల్వకుర్తికి చెందిన వర్కాల భాస్కర్ రెడ్డి చివరికి పైచేయి సాధించారు. భారీ పోటీ మధ్య ఆయన రూ. 3 కోట్లు 80 లక్షల 1,000 రూపాలకు కు సంత హక్కులను దక్కించుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి ధర గణనీయంగా పెరగడం విశేషం. గత ఏడాది ఇదే సంత రూ. 1 కోటి 22 లక్షలు 55 వేలుకు కుదిరగా, ఈసారి మూడు రెట్లు పైగా పెరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పశువుల వ్యాపారంలో పెరుగుతున్న చురుకుదనం, మార్కెట్‌కు ఉన్న డిమాండ్ ఈ పెరుగుదలకు కారణమని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## రామాయంపేట నియోజకవర్గాన్ని పునర్ధించే వరకు పోరాడుతాం



**రామాయంపేట మార్చి 25 (మహాప్రభ):**
నూతన నియోజకవర్గాల ఏర్పాటులో భాగంగా రామాయంపేట నూతన నియోజకవర్గం ఏర్పాటు చేసేవరకు పోరాడుతామని బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామయంపేట గతంలోని నియోజకవర్గం గా ఏర్పాటు అయ్యేదని గత రాజకీయాల కోసం రామాయంపేట నియోజకవర్గ ఏర్పాటుకు నోచుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం మేరకు రామాయంపేట నూతన నియోజకవర్గం ఏర్పాటు అయ్యేవరకు పార్టీలకతీతంగా అందరం కలిసి పోరాడుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం స్థానిక తహసిల్దార్ రజనికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పాపన్నపేట మండలంలోని గాంధారిపల్లి గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు సీజ్



**పాపన్నపేట,మార్చి 25( మహా ప్రభ)**
పాపన్నపేట మండలం గాంధారిపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సత్య స్వామి, మంజుల క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి 3 ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం...



**శివంపేట,మార్చి 25 (మహాప్రభ):**
శివంపేట మండల పరిధిలోని చండి గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ గైనిపల్లి ప్రవీణ్ గౌడ్ తో కలిసి మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ గైనిపల్లి ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వీధుల గుండా సిసి రోడ్డు పనులు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని తాను గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి,ఉప సర్పంచ్ సౌజన్య నరేష్,మాజీ సర్పంచ్ వినోద సంజీవ చారి,వార్డు సభ్యులు వెన్నెల, సందిలా శ్రీనివాస్ గౌడ్, షేక్ అబ్దుల్ లాతీఫ్,కర్రె వీరేష్, ఉదరి ఆంజనేయులు, నర్సింగ్ ఆంజనేయులు,నాయకులు పుల్లగూర్ల ఆంజనేయులు, ముత్యం రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన రోడ్డు .. పనులు ప్రారంభం



**పాపన్నపేట, మార్చి 25( మహాప్రభ )**
కుర్తివాడ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులను ఆయన ఉపసర్పంచ్ అనిల్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వార్డు సభ్యులు..దుర్గయ్య,రాజేందర్,మాజీ సర్పంచ్ రామాగౌడ్,నాయకులు పట్లోళ్ల నాగరాజు,కొనింటి రాజు,ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## సింగరేణిలో చిన్న కాంట్రాక్టర్లపై అన్యాయం



**మంథని, మార్చి 25 (మహాప్రభ):**
: సింగరేణి ఆర్జి--3 ఏఎల్‌పి గనిలో జంకో, జెఎంఎస్ సింగ్ & సన్స్, వెన్సర్ కంపెనీలు నిర్వహిస్తున్న పనుల్లో అవినీతి, కార్మికులపై అన్యాయం జరుగుతోందని బీజేపీ జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్లకు ఒక న్యాయం, పెద్ద కాంట్రాక్టర్లకు మరో న్యాయం జరుగుతోందని ఆయన విమర్శించారు. కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దురదృష్టకరమని, అధికారులు మౌనం వహించడం పెద్ద స్థాయి అవినీతికి సంకేతమని పేర్కొన్నారు. సంబంధిత కంపెనీలపై విజిలెన్స్ విచారణ జరిపి, కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనాలు అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లపై బ్లాక్‌లిస్టింగ్ వంటి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తీగల శ్రీధర్, కొత్త కమలాకర్, మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్ పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లపై ఆకస్మిక తనిఖీలు




**కరీంనగర్, మార్చి 25 (మహాప్రభ):**
జిల్లాలోని పెట్రోల్ బంక్‌లలో జరుగుతున్న అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కొన్ని బంక్‌లలో 2.5 నుండి 3 లీటర్ల వరకు కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. హెచ్పిసిఎల్, ఐఓసిఎల్, బిపిసిఎల్ సంస్థలకు చెందిన బంక్‌లలో కూడా పరిశీలనలు జరిగాయి. పెట్రోల్ బంక్‌లలో డిజిటల్ యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నదానిపై (పి ఈ ఎస్ ఓ) నిబంధనల ప్రకారం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కొలతల్లో లోపాలు ఉన్న బంక్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వినియోగదారులు పెట్రోల్ పోసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగనున్నాయి.

## స్టీల్ బ్యాంకులను వినియోగించండి

**హుస్నాబాద్, మార్చి 25 (మహాప్రభ):**
హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 8వ వార్డులోని హనుమాన్ ఆలయం వద్ద చెత్త విభజనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గృహాల నుండి వచ్చే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి పురపాలక సంఘ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ సెంటర్‌కు పంపించి, తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి మొక్కలకు వినియోగించుకోవచ్చని వివరించారు.



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతకు సహకరించి హుస్నాబాద్‌ను ఆరోగ్యకరమైన, శుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పురపాలక సంఘం తయారు చేసిన సేంద్రియ ఎరువును వార్డు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, వార్డు కౌన్సిలర్ కాశబోయిన సరిత, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, జవాన్ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### బీసీలపై దాడులు అరికట్టాలంటే
## ప్రత్యేక చట్టమే మార్గం

సామాజికవేత్త బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ .

**దేవరకొండ,మార్చి 25 (మహాప్రభ):**
ఎస్సీ ఎస్టీలకు అమల్లో ఉన్న అట్రాసిటీస్ చట్టం తరహాలో బీసీలకు కూడా ప్రత్యేక బీసీ పరిరక్షణ చట్టం తీసుకురావాలని సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. బీసీలు మెజారిటీ అయినప్పటికీ వారిపై జరుగుతున్న దాడులు వివక్షలను అరికట్టే రక్షణ లేకపోవడం బాధాకరమైన అన్నారు. బుధవారం నాడు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించి అసెంబ్లీలో ఆమోదానికి సిద్ధం చేస్తుండడం పేర్కొన్నారుగా ఎస్సీల మాదిరిగా రక్షణ చట్టం కావాలని తెలంగాణ ప్రభుత్వం కూడా అదే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలంటే వెనుకబడిన కులాలకు ప్రత్యేక పరిరక్షణ చట్టం అవసరం వడ్డెర, పిచ్చుకుంట్ల, బుడబుక్కల చాలా కులాల సంచార జాతులుగా జీవిస్తున్నాయి. గౌరవ ముఖ్యమంత్రివర్యులు వద్ద సరియైన కుల గణాంకాలు లేకపోవడం వల్ల సమాజంలో అసమానతలు దాడులు జరగడం వల్ల స్వేచ్ఛగా జీవించేటువంటి పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణమే ఆలోచన చేసి ఏపీలో మాదిరిగా తెలంగాణలో కూడా బీసీలకు పరిరక్షణ చట్టం తేవాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న భిక్షమయ్య ,గిరి, ఆరె కంటి శ్రీనివాస్ గౌడ్ ,చిట్టిపోలు వెంకన్న ,భీమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**ఆమనగల్లు,మార్చి 25 (మహాప్రభ):**
బీజేపీ బలోపేతం దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలోని భవాని గార్డెన్ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్ కెకె, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో కండె హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని



మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. పదేళ్లలో మోదీ ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారని, యువతను పార్టీలోకి ఆహ్వానించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జనరల్ సెక్రెటరీలు గోరటి నర్సింహా, నాగేందర్ గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి అన్నం శేఖర్ రెడ్డి, ప్ర శిక్షణ అభియాన్ సహ ప్రముఖ్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం సీనయ్య, చెక్కల లక్ష్మణ్, సభ్యులు తిప్పిరెడ్డి రామిరెడ్డి, మాజీ ఛైర్మన్ రాంపాల్ నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ సభ్యులు మెక్కల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, నిరంజన్ నాయక్, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు, ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వన్‌ప్లస్ సీఈవో రాబిన్ లియు రాజీనామా



ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వన్‌ప్లస్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాబిన్ లియు తన పదవి నుంచి తప్పుకున్నట్లుగా కంపెనీ అధికారికంగా ధృవీకరించింది. అంతర్జాతీయ స్థాయిలో కంపెనీ తన వ్యాపార నిర్మాణాన్ని మారుస్తున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసుకుంది.రాబిన్ లియు 2018లో వన్‌ప్లస్ ఇండియా సంస్థలో చేరారు. తన వ్యక్తిగత ఆసక్తుల కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కంపెనీ తెలిపింది. ఇండియాలో వన్‌ప్లస్ వృద్ధికి ఆయన చేసిన కృషిని కంపెనీ కొనియాడింది. అయితే, రాబిన్ లియు రాజీనామాతో ఇండియాలో వన్‌ప్లస్ కార్యకలాపాలు నిలిచిపోతాయన్న ఊహాగానాలను కంపెనీ తోసిపుచ్చింది.వన్‌ప్లస్ ఇండియా’ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, వ్యాపార కొనసాగింపులో ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. రాబిన్ లియును ‘రియల్ మీ’ సీఈవో స్కై లీకి రిపోర్ట్ చేయాలని ఒప్పో గ్రూప్ కోరినట్లుగా తెలుస్తోంది. గతంలో వీరిద్దరూ సమాన హోదాలో ఉండేవారు.ఇప్పుడు ఒప్పో సబ్-బ్రాండ్‌ల బాధ్యతలను స్కై లీకి అప్పగించడంతో ఈ మార్పు వచ్చినట్లుగా సమాచారం.మరోవైపు 2025లో వన్‌ప్లస్ షిప్‌మెంట్లు దాదాపు 32 శాతం నుంచి 38 శాతం వరకు తగ్గినట్లు మార్కెట్ పరిశోధనా సంస్థలు వెల్లడించాయి. ప్రీమియం విభాగంలో గట్టి పోటీ ఎదురవ్వడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.

- సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభం..
- నిఫ్టీ 394 పాయింట్లు జంప్



భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో రోజు కూడా లాభాలు పొందడం విశేషం. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభంతో 75,273.45 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 394.05 పాయింట్ల లాభంతో 23,306.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్ మంగళవారం 74,068.45 పాయింట్ల వద్ద ముగియగా, బుధవారం ఉదయం 74,652.01 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది.ఒక దశలో 75,849.76 పాయింట్లను తాకింది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. బుధవారం అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో కొనసాగడం భారతీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది. అలాగే ఇరాన్-అమెరికా మధ్య చర్చలు, ట్రంప్ శాంతి ప్రతిపాదన వంటి అంశాలు కూడా మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పడుతున్నాయి. ఆసియా మార్కెట్లైన దక్షిణ కొరియా బెంచ్‌మార్క్ కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ వంటివి బుధవారం లాభాల్లో ముగిశాయి. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ షేర్లు అత్యధికంగా 4.39 శాతం లాభాలు పొందాయి. లార్సెన్ అండ్ టర్బో లిమిటెడ్ 4 శాతం, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ 3.82 శాతం, టైటాన్ కంపెనీ లిమిటెడ్ 3.50 శాతం, ట్రెంట్ లిమిటెడ్ 3.39 శాతం పెరిగాయి.టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు నష్టాలు చవిచూశాయి. మరోవైపు తాజా పరిణామాలతో అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ చమురు ధర 100 డాలర్ల దిగువకు చేరింది. ఈ రోజు దాదాపు 99 డాలర్ల వద్ద ఆయిల్ ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 93.96గా ఉంది. అయితే, బంగారం ధరలు మాత్రం బుధవారం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర 4,554 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఔన్స్ వెండి ధర 72 డాలర్లకుపైగా కొనసాగుతోంది.


## 3 లక్షల కోట్లకు మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్

**ముంబై,**



మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగం శరవేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్నది. ప్రతియేటా 7 శాతం వృద్ధితో 2028 నాటికి ఈ రంగం రూ.3.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని ఫిక్కీ-ఈవై ఎంఅండ్ఈ నివేదికలో వెల్లడించింది. 2025 నాటికి ఈ రంగం రూ.2.78 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో లక్ష కోట్ల రూపాయల స్థాయిలో ఉన్న డిజిటల్ మీడియా అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నది.డిజిటల్ ప్రకటనల ద్వారా రూ.94,700 కోట్ల ఆదాయం సమకూరుతున్నదని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే 26 శాతం వృద్ధిని సాధించిందని వెల్లడించింది. మొత్తంమీద ప్రకటనల ఇండస్ట్రీ 13.5 శాతం వృద్ధితో రూ.1.5 లక్షల కోట్లకు చేరుకున్నది.

## ఐపీఎల్ 19వ సీజన్ కు అంతా సిద్ధం..




ఐపీఎల్ ట్రోఫీ సాధనకు ఇరుజట్లలో తొలి అడుగు ఎవరు వేస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఐపీఎల్ కొత్త సీజన్ ఆరంభ మ్యాచ్ లో అదరగొట్టేదెవరు? బెదిదేరి ఎవరు? ఐపీఎల్ లో ఈ రెండు జట్లు ఎన్ని సార్లు తలపడ్డాయి? ఏ జట్టు ఎన్నిసార్లు గెలిచిందనేది అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు. ఇక ఐపీఎల్ అంటే బౌండరీల మోత... సిక్సర్ల హోరుతో బ్యాటర్ల విన్యాసాలు... ప్రమాదకర బంతుల్ని సంధించే బౌలర్లు పడగొట్టే వికెట్లు... చూసే అభిమానుల్ని కేరింతలు కొట్టించబోతున్నాయి. ఒక్కో జట్టుది ఒక్కో ప్రత్యేకత... ఆటగాళ్లది ప్రత్యేక శైలి. ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో రికార్డుల సృష్టిలో ఏ జట్టుకు ఆజట్టే ప్రత్యేకమని చెప్పవచ్చు. ఆటగాళ్లు మారిపోయినా.. ఆయా జట్ల తరఫున ఆడినపుడు సాధించిన రికార్డులు చెక్కుచెదరని రికార్డులుగా నిలిచిపోయాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున 18 ఏళ్లు పూర్తి చేసుకుని 19వ సీజన్లో ఆడే ఒకే ఒక ఆటగాడిగా విరాట్ కోహ్లీ ఎవర్‌గ్రీన్ ఐపీఎల్ రికార్డు సొంతం చేసుకున్నారు. సుధీర్ఘకాలం ఒకే జట్టు తరఫున... ఆడటమే కాదు... అన్ని సీజన్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ గా విరాట్ కోహ్లీ నిలిచాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18 సీజన్లను పూర్తి చేసుకుంది. ఈ అన్ని సీజన్లలో ప్రాతినిధ్యం వహించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు - డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ పేరు మార్చుకుని ఐపీఎల్ లో స్థిరపడి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటిదాకా ఐపీఎల్ లో అత్యధిక స్కోర్లు, అతి తక్కువ పరుగులు చేసిన సందర్భాలున్నాయి. ఐపీఎల్ రికార్డ్స్ ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ జట్టు 273 మ్యాచులు ఆడి 133 మ్యాచుల్లో విజయం సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 197 మ్యాచులను ఆడి 93 విజయాలను సొంతం చేసుకుంది. పేరు మారినా... డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ జట్టు .... సన్ రైజర్స్ హైదరాబాద్.. వేర్వేరు పేర్లతో ఐపీఎల్ లో ట్రోఫీలను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై విజయం సాధించి చేజిక్కించుకున్నాయి. రెండు సందర్భాల్లోనూ ప్రత్యర్థి జట్టుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పరాజయాన్ని చవిచూసింది. 2009 ఐపీఎల్ సీజన్ ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ పై రోహిత్ శర్మ సారథ్యంలో డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. 2016లో రాయల్ ఛాలెంజర్స్ పై డేవిడ్ వార్నర్ సారథ్యంలో సన్ రైజర్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. 2025 ఐపీఎల్ సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్ జట్టు పై రజత్ పాటిదర్ సారథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ ట్రోఫీని తొలిసారిగా ముద్దాడింది.సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐపీఎల్ మ్యాచుల్లో బెంగళూరు జట్టుతో పోటీపడి చారిత్రక పరుగుల రికార్డును సొంతం చేసుకుంది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా 2024 ఐపీఎల్ సీజన్లో మార్చి 30వ తేదీన హైదరాబాద్ చారిత్రక రికార్డు సృష్టించింది. మూడు వికెట్లను కోల్పోయిన హైదరాబాద్ జట్టు ఐపీఎల్ లోనే అత్యధికగంగా 287 పరుగులు సాధించి సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. ఆ మ్యాచులో హైదరాబాద్ ఆటగాడు... ట్రావిస్ హెడ్ 41 బంతుల్లో అద్భుతమైన సెంచరీ చేసి ఆ మ్యాచులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఏడు వికెట్ల నష్టానికి 262 పరుగులతో సరిపెట్టుకుంది. ఐపీఎల్ లో గడిచిన 24 మ్యాచుల్లో విన్నింగ్ హిస్టరీని పరిశీలిస్తే... రాయల్ చాలెంజర్స్ పై సన్ రైజర్స్ హైదరాబాద్ దే పైచేయిగా ఉంది. ఫస్ట్ బ్యాటింగ్ అయినా... లక్ష్యాన్ని చేదించే సమయంలోనూ బెంగళూరు జట్టుపై హైదరాబాద్ జట్టే విజయవకాశాలను చేజిక్కించుకుంది. 24 మ్యాచుల్లో 13 మ్యాచులను సన్ రైజర్స్ హైదరాబాద్ పైచేయి సాధిస్తే... 11 మ్యాచులను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. సన్ రైజర్స్ 166 సగటు పరుగులు కాగా... బెంగళూరు జట్టు సగటు పరుగులు 162గా నమోదైంది. జట్టు పరంగా అత్యధిక స్కోరు సాధనలోనూ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టే 287 పరుగులతో అగ్రస్థానంలో నిలించింది. 262 పరుగులతో బెంగళూరు జట్టు తర్వాత స్థానంలో నిలిచింది. అత్యల్ప స్కోరు సాధనలోనూ 72 పరుగులతో సన్ రైజర్స్ హైదరాబాదే పైచేయిగానిలిచింది. బెంగళూరు జట్టు 68 పరుగులు చేసి రెండో స్థానంలో నిలిచింది.

## ఎల్లీస్ స్థానంలో జాన్సన్

**చెన్నై:**

ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లీస్ గాయంతో ఐపీఎల్‌కు దూరమవడంతో అతడి స్థానాన్ని చెన్నై సూపర్ కింగ్స్.. ఆసీస్‌కే చెందిన మరో పేసర్ స్పెన్సర్ జాన్సన్‌తో భర్తీ చేసింది.2024 వేలంలో గుజరాత్‌కు రూ. 10 కోట్ల ధరకు అమ్ముడైన జాన్సన్.. నిరుడు కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆడాడు.



# స్పోర్ట్స్

## దక్షిణాఫ్రికాదే టీ20 సిరీస్..

### ఐదో టీ20లో న్యూజిలాండ్‌పై ఘన విజయం



సొంత గడ్డపై న్యూజిలాండ్ జట్టుకు పరాభవం ఎదురైంది. 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను దక్షిణాఫ్రికా కైవసం చేసుకుంది. బుధవారం క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 33 పరుగుల తేడాతో న్యూజిలాండ్ జట్టుపై గెలుపొందింది. తద్వారా టీ20 సిరీస్‌ను 3-2తో గెలుపొందింది.ఐదో టీ20 మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు సాధించింది. సఫారీ బ్యాటర్లలో కానర్ ఎస్టర్‌హుయిజెన్ (75; 33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసకర హాఫ్ సెంచరీ చేశాడు. రూబిన్ హెర్మాన్ (39), వియాన్ ముల్డర్ (31), డయాన్ ఫోరెస్టర్ (21 నాటౌట్) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో బెన్ సియర్స్ రెండు వికెట్లు పడగొట్టగా.. జాకరీ ఫౌల్క్స్, జోష్ క్లార్క్సన్ చెరో వికెట్ సాధించారు. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ టీమ్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులకే పరిమితమైంది. న్యూజిలాండ్ బ్యాటర్లలో బెవోన్ జాకబ్స్ (36; 19 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. జేమ్స్ నీషమ్ (24), డేన్ క్లీవర్ (24) లు పర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఒట్నీల్ బార్ట్‌మాన్, గెరాల్డ్ కోట్జీ, వియాన్ ముల్డర్‌లు తలా రెండు వికెట్లు సాధించారు. కేశవ్ మహారాజ్ ఓ వికెట్ పడగొట్టాడు.




# జపాన్ మంచులో సాయిపల్లవి ప్రేమకథ..

## తెలుగులో 'ఒక రోజు'గా ఏక్ దిన్!

నటి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఒక గుడ్ న్యూస్ వచ్చింది. ఆమె నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' ఇప్పుడు తెలుగులో 'ఒక రోజు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా రాబోతున్న ఈ సినిమాను అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. జపాన్ మంచు కొండల నేపథ్యంలో సాగే ఈ సుందరమైన ప్రేమకథలో సాయిపల్లవి తన సహజ సిద్ధమైన నటనతో మరోసారి మాయ చేయబోతున్నట్లు సమాచారం.ట్రైలర్ చూస్తుంటే.. కేవలం ఒకే ఒక్క రోజులో జరిగిన పరిణామాలు ఇద్దరు వ్యక్తుల జీవితాలను ఎలా మార్చాయనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న సినిమా కావడం, దానికి తోడు సాయిపల్లవి లాంటి ప్రతిభావంతురాలైన నటి ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విభిన్నమైన ప్రేమకథను మే 1వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది



## క్యూట్‌గా కవ్విస్తున్న ప్రియాంక మోహన్..

# ధురంధర్ –2 కలెక్షన్ల సునామీ




బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.



# బంపర్ ఆఫర్ కొట్టేసిందా?

అస్సాం సుందరి కయాదు లోహర్ కెరీర్‌లో సక్సెస్ అంటే 'డ్రాగన్' సినిమా ఒక్కటే. దానికి ముందుగానీ, తర్వాత గానీ ఈ అందాలభామకు హిట్ లేదు. అయితే.. అదృష్టం మాత్రం ఈ ముద్దుగుమ్మ వెన్నంటే ఉంది. అందుకే అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా ఓ క్రేజీ టాలీవుడ్ మూవీలో కయాదు ఛాన్స్ కొట్టేసినట్టు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా, హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే.ఇందులో వెంకీకి జోడీగా కీర్తి సురేశ్‌ని ఇప్పటికే సెలక్ట్ చేయగా, కల్యాణ్‌రామ్ సరసన కయాదు లోహర్‌ని ఖరారు చేసినట్టు తెలిసింది. అపజయం అనేది తెలియని అనిల్ రావిపూడి సినిమాలో కథానాయికగా ఛాన్స్ లభించడమంటే, అది సాధారణమైన విషయం కాదు. ఇదే నిజమైతే.. ఈ అమ్మడి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.

# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

## హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం



టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్' అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు.ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

# క్లైమాక్స్ మనసుల్ని కదిలిస్తుంది



కోర్ట్' జోడీ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన వినోదాత్మక యువతరం సినిమా 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకుడు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న శ్రీరామనవమి కానుకగా విడుదల కానున్నది. ఇటీవల ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. చిత్ర సమర్పకుడు కోన వెంకట్ మాట్లాడుతూ 'ఈ కథ వినగానే రోషన్, శ్రీదేవి అయితే పర్‌ఫెక్ట్ అనిపించింది.ఈ సినిమా తర్వాత ఈ జంటను వెతుక్కుంటూ కథలు వస్తాయి. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్ మనసుల్ని కదిలిస్తుంది. నా కుమార్తెలు కావ్య, శ్రావ్య ఈ సినిమాతో నిర్మాతలుగా మారారు. తప్పక విజయం సాధిస్తారని నమ్మకంతో ఉన్నా' అని అశాభావం వెలిబుచ్చారు. ఇది ఎమోషనల్ మూవీ అనీ, సాంకేతికంగా అన్ని విభాగాలూ ప్రాణం పెట్టి పనిచేశాయని, క్లైమాక్స్ కంటతడి పెట్టిస్తుందని దర్శకుడు సతీష్ జవ్వాజి చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు హర్ష్ రోషన్, శ్రీదేవి ఆనందం వెలిబుచ్చారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com